సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 11 । డిసెంబర్ । 2023



కూతురు ఇంట్లో తండ్రి దొంగతనం

అతను తాగుడు కోసం బిడ్డ ఇంట్లోనే దొంగతనానికి పాల్పడ్డాడు. డబ్బు, సెల్‌ఫోన్‌తోపాటు మనవరాలైన మూడు నెలల పసికందును ఎత్తుకెళ్లాడు. -8లో



అమ్మా నాన్నతో ఓ ఆదివారం

చాపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రతి నెలా రెండో ఆదివారం విద్యార్థినులను తల్లిదండ్రులతో కలిసేందుకు అవకాశం కల్పిస్తారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
31.2/21.7

వాతావరణం

జిల్లాలో ఆదివారం 21.7 – 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

సాధికార చైతన్యం.. పోటెత్తిన జనం



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు. చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం
- ఉత్సాహ భరితంగా పాల్గొన్న ప్రజలు
- హోరెత్తిన నినాదాలు



అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్, అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



సామాజిక సాధికార బస్సుయాత్రకు హాజరైన జన సందోహం

కడప కార్పొరేషన్: కమలాపురం నియోజకవర్గంలో సామాజిక సాధికార చైతన్యం ఎగసిపడింది. చెన్నూరు కొండపేట వద్ద నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర సంరంభం అంబరాన్నంటింది. నియోజకవర్గ నలుమూలల నుంచి వెల్లువలా తరలివచ్చిన జనంతో కొండపేట బ్రిడ్జి పోటెత్తింది. వీఎన్‌పల్లి, పెండ్లిమర్రి, వల్లూరు, కమలాపురం, సీకేదిన్నె, చెన్నూరు మండలాల నుంచి 436 బస్సులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 20 వేల మంది జనం తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచే చెన్నూరులో ఉత్సాహ భరిత వాతావరణం నెలకొంది. బ్రిడ్జి పొడవునా ఇరువైపులా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు కట్టారు. మధ్యాహ్నం సభ మొదలు కానుండటంతో జనానికి ఎక్కడికక్కడ భోజన ఏర్పాట్లు చేశారు. వైవీయూ, తోళ్లగంగనపల్లె, జయరాజ్ గార్డెన్, చెన్నూరు ప్రాంతాల్లో భారీ ఎత్తున భోజన ఏర్పాట్లు చేశారు. మహిళల కోసం కొండపేట బ్రిడ్జి వద్ద ప్రత్యేకంగా తెప్పించిన మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సుమారు 850 మీటర్ల పొడవున్న కొండపేట బ్రిడ్జి మధ్యాహ్నం 2 గంటలకే జన సందోహంతో నిండిపోయింది. ప్రధాన వక్తలు మాట్లాడుతున్నప్పుడు సభలో ఉన్నవారు వైఎస్సార్‌సీపీ టోపీలు, వైఎస్ జగన్ మాస్కులు ధరించి, జెండాలు చేతబూని, ప్లకార్డులు ప్రదర్శించారు. జై జగన్, జయహో జగన్ అనే నినాదాలు హోరెత్తాయి. మొత్తం మీద సామాజిక సాధికార బస్సుయాత్ర బ్రహ్మాండంగా విజయవంతమైంది. మధ్యాహ్నం 3.35 గంటలకు ప్రారంభమైన సభ 5.15కు ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, ఎంవీ రామచంద్రారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్‌ఏ కరిముల్లా, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే బ్రిడ్జి నిర్మాణం



బ్రిడ్జి నిర్మించాలని కొండపేట వాసులు గతంలో ఎన్ని ప్రభుత్వాలను కోరినా ఎవరూ పట్టించుకోలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే బ్రిడ్జి నిర్మించి ఈ ప్రాంత వాసుల కల నెరవేర్చారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ బకాయిలు రూ.16 కోట్లను తీర్చేశారు. – వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు, కడప

గతంలో కాగితాలకే పరిమితం



సామాజిక సాధికారత అనేది గతంలో కాగితాలకే పరిమితమైంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే చేతల్లో చూపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా అధికారం, గుర్తింపు ఇచ్చారు. ఇప్పుడు మన సమయం వచ్చింది. ఇంత మంచి చేసిన జగనన్నకు అండగా ఉందాం. – బుట్టా రేణుక, మాజీ ఎంపీ, కర్నూలు

రూ.4450 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి



కమలాపురం నియోజకవర్గంలో రూ.4450 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పులివెందుల తర్వాత అత్యధికంగా అభివృద్ధి పనులు జరుగుతున్న నియోజకవర్గం మనదే. ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తమ నియోజకవర్గ ప్రజలకు రూ.1450 కోట్ల లబ్ధి చేకూరింది. – పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, కమలాపురం

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా పాలన



ఈ నాలుగున్నరేళ్లలో ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా జగనన్న పాలన చేశారు. పేదరికాన్ని అంతమొందించేందుకు దేశంలో మేటి సంక్షేమ పథకాలను అమలు చేశారు. సాధికారత నినాదం కాదు మా విధానం అని నిరూపించారు. మహాత్మాగాంధీజీకి నిజమైన వారసుడు జగనే. – పి. నరేన్ రామాంజులరెడ్డి, జెడ్పీటీసీ, సీకేదిన్నె

ఉత్సాహంగా మ్యాథ్ ‘బి’



జీఎంఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన మ్యాథ్ బి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ: లెక్కలంటే అన్నీ చిక్కులే.. అర్థం చేసుకున్న వారికి మాత్రం ఆసక్తికరం. చిన్న వయసులో నేర్చుకునే గణిత చిట్కాలు జీవితాంతం గుర్తుండి పోతాయనేది నిపుణుల మాట. విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి.. వారిలో గణితం పట్ల ఆసక్తి పెంచేలా.. చిన్న చిన్న సమస్యలు మొదలు.. వారి స్థాయిని అనుసరించి నిర్వహించిన సాక్షి మ్యాథ్ ‘బి’ కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కడప నగరంలోని జీఎంఆర్ హైస్కూల్‌లో ఆదివారం సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో డ్యూక్స్ వ్యాపి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త సహకారంతో నిర్వహించిన మ్యాథ్ ‘బి’ రెండో రౌండ్ కాంపిటీషన్ నాలుగు కేటగిరీలుగా నిర్వహించారు. కేటగిరీ–1లో 1, 2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–2లో 3,4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–3లో 5, 6,7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కాంపిటీషన్‌లో కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, జీఎంఆర్ హైస్కూల్, సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామానికి చెందిన నేతాజీ హైస్కూల్ విద్యార్థులు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు.

మ్యాథ్స్ అంటే ఎంతో ఇష్టం



నాకు గణితం అంటే ఎంతో ఇష్టం. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్ ‘బి’ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు వచ్చాను. ఈ కాంపిటీషన్ ఎంతో బాగుంది. వచ్చే ఏడాది కూడా ఈ కాంపిటీషన్‌లో పాల్గొంటా. – ఎస్.శాన్విక, 4వ తరగతి, నేతాజీ హైస్కూల్, గురిజాల, సింహాద్రిపురం మండలం

మ్యాథ్స్ మేడ్ ఈజీ..



గణితం అంటే ఎంతో ఆసక్తి. గణితాన్ని సులువుగా నేర్చుకునేందుకు ఎప్పుడూ సిద్ధమవుతుంటా. మ్యాథ్స్ కాంపిటీషన్స్ ఎక్కడ ఉన్నా పాల్గొంటా. గణితంపై ఉన్న ఇష్టమే నన్ను ఈ కాంపిటీషన్‌లో పాల్గొనేలా చేసింది. – జి.విద్య, 3వ తరగతి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప

గణిత భావనలపై పట్టు సాధించేందుకు..



గణితంలో రాణిస్తే అన్నింటా రాణించే అవకాశం ఉంది. అందుకే గణితంపై పట్టు సాధించేందుకు బేసిక్స్ నుంచి పట్టుసాధిస్తున్నా. ఇందులో భాగంగా మ్యాథ్‘బి’లో సత్తా తెలుసుకునేందుకు వచ్చాను. కాంపిటీషన్ చాలా బాగుంది. – యు.శరణ్యసాయి, 7వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

గణితం పట్ల భయం పోయింది



గణితం అంటే.. ఎక్కడో ఏదో ఒకమూల కొద్దిపాటి భయం ఉండేది. అయితే ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్న తర్వాత నేను కూడా చక్కగా గణిత సమస్యలను పరిష్కరించగలనన్న నమ్మకం కలిగింది. సాక్షి మ్యాథ్ ‘బి’ కాంపిటీషన్ నిర్వహణ బాగుంది. – చరణ్‌రెడ్డి, 6వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

స్పెల్‘బి’ కాంపిటీషన్‌కు విశేష స్పందన

- పెద్ద సంఖ్యలో విద్యార్థుల హాజరు
- ఆంగ్లంపై ఆసక్తి పెరుగుతుందంటున్న చిన్నారులు



నాగార్జున మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న స్పెల్ ‘బి’ కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ: సాక్షి మీడియా ఆధ్వర్యంలో డ్యూక్స్ వ్యాపి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న స్పెల్ ‘బి’ కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్పెల్ ‘బి’ కాంపిటీషన్ క్వార్టర్ ఫైనల్ రౌండ్‌కు చక్కటి స్పందన లభించింది. ఈ కాంపిటీషన్‌కు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఆంగ్లంపై మక్కువ పెంచేలా, ఆసక్తి కలిగించేలా ప్రయత్నం చేస్తున్న ‘సాక్షి’కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ఈ కాంపిటీషన్ మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. ఇందుకు పెద్దసంఖ్యలో విద్యార్థులు వచ్చి, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంగ్లం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేలా.. భాషపై పట్టుసాధించేలా కాంపిటీషన్ ఉందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. కాగా ఆదివారం నిర్వహించిన కాంపిటీషన్‌లో కేటగిరీ–1లో 1, 2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–2లో 3, 4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–3లో 5, 6, 7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌కు కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్, జీఆర్‌టీ–జీవీకే హైస్కూల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, జీఎంఆర్ హైస్కూల్, సింహాద్రిపురం మండలం గురిజాలకు చెందిన నేతాజీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంగ్లిషు అంటే ఆసక్తి పెరిగింది



స్పెల్ ‘బి’ కాంపిటీషన్‌లో పాల్గొనడం వల్ల ఇంగ్లిషు భాష పట్ల ఆసక్తి పెరిగింది. ఇందుకోసం కొత్త పదాలను నేర్చుకున్నాను. ఈ స్పెల్లింగ్స్ నేర్చుకోవడం నాకు అకడమిక్‌గా కూడా ఉపయోగకరం. – పి.నవనీష్, 3వ తరగతి, నాగార్జున మోడల్‌స్కూల్, కడప

అకడమిక్‌గా కూడా ఉపయోగం



సాక్షి స్పెల్‘బి’ కాంపిటీషన్ పరంగానే కాక అకడమిక్‌గా కూడా చాలా ఉపయోగపడుతోంది. కాంపిటీషన్ కోసం వందల్లో పదాలు నేర్చుకునే అవకాశం కలిగింది. తద్వారా అకడమిక్‌గా కూడా ఉపయోగపడుతుంది. – యుహానా, 7వ తరగతి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప

తొలిసారిగా రాస్తున్నా..



నాకు ఇంగ్లిషు అంటే ఎంతో ఇష్టం. కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నేను ఈ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు వచ్చాను. మాకు ఇచ్చిన మెటీరియల్‌లో చాలా పదాలకు స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. – బి.ఎస్. రిషిత, 2వ తరగతి, నేతాజీ హైస్కూల్, గురిజాల, సింహాద్రిపురం మండలం

ఆంగ్లంపై పట్టు సాధించేందుకు..



ఆంగ్లభాష పట్ల ఉన్న ఆసక్తే ఈ కాంపిటీషన్‌కు హాజరయ్యేలా చేసింది. ఆంగ్ల భాషలో పట్టుసాధించాలన్న నా లక్ష్యానికి ఈ కాంపిటీషన్ దోహద పడుతుంది. ఇందుకోసం బాగా ప్రిపేర్ అయ్యాను. – ఎం.వెంకటసాయిలక్ష్మి, 4వ తరగతి, జీఆర్‌టీ జీవీకే హైస్కూల్, కడప

వైభవంగా కలశ ప్రతిష్ట



కలశాలను తీసుకొస్తున్న గడికోట మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు

రాయచోటి టౌన్: దక్షిణ కాశీగా వెలుగొందుతున్న రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ పశ్చిమ రాజగోపుర కలశప్రతిష్టను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మఠం పరమేశ్వర స్వామి, పురోహితుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ గోపురంపైకి ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిలు వెళ్లి కలశస్థాపన చేశారు. లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి సతీసమేతంగా, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సతీమణి గడికోట లలితారెడ్డి కలశ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్నారు.

భళా.. రక్షక భట నిలయం

- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయానికి అధునాతన భవనాలు
- రూ.3.50 కోట్లతో నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న డీజీపీ, ఎమ్మెల్యే



డీఎస్పీ కార్యాలయ భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలపై స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి జిల్లా అధికారులతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో డీఎస్పీ కార్యాలయంతోపాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు విశాలమైన స్థలంలో రూ.3.50 కోట్లతో అధునాతన భవనాలు నిర్మించారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంలోనూ, జిల్లా, డివిజన్ స్థాయి కార్యాలయాలకు స్థలాల కేటాయింపు, అధునాతన భవనాల నిర్మాణంలోనూ మరీ ముఖ్యంగా శాంతి భద్రతల పరిరక్షణ, రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిలు తీసుకుంటున్న చొరవ సత్ఫలితాల దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లా కేంద్రం కాకమునుపే రాయచోటిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయం మంజూరు చేయించారు. రాయచోటి పట్టణ ప్రాంతంలో జనాభా విస్తరిస్తున్న దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు అనుగుణంగా పోలీస్ కార్యాలయాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, డీఎస్పీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను పట్టణ పరిధి చిత్తూరు మార్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఎస్టీ కాలనీ వద్ద 1.14 ఎకరాల విస్తీర్ణంలోను, డీఎస్పీ కార్యాలయాన్ని కడప రహదారి మార్గంలో ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా 1.50 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత సుందరంగా, శరవేగంగా భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ భవనాలు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించేలా జిల్లా పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు.

నేడు జిల్లాకు డీజీపీ రాక

కడప అర్బన్: రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి (డీజీపీ) కె. రాజేంద్రనాథ్‌రెడ్డి వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనున్నారు. మొదట అన్నమయ్య జిల్లా రాయచోటికి సోమవారం ఉదయం వెళ్లి అక్కడి కార్యక్రమాలు చూసుకుంటారు. మధ్యాహ్నం భోజనం తరువాత కడపకు వచ్చి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించనున్నారని పోలీసు వర్గాల సమాచారం.

న్యూస్‌రీల్

16న టెన్నికాయిట్ ఎంపికలు

పులివెందుల: స్థానిక డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈ నెల 16వ తేదీన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొనే వైఎస్సార్ జిల్లా జట్టును ఎంపిక చేస్తున్నట్లు టెన్నికాయిట్ ఉమ్మడి కడప జిల్లా కార్యనిర్వాహణ కార్యదర్శి మంజు తెలిపారు. ఈ పోటీలకు 15 ఏళ్లు నిండిన పురుష, మహిళల క్రీడాకారులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 28, 29, 30వ తేదీలలో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. క్రీడాకారుల రవాణా చార్జీలు, ట్రాన్స్‌పోర్ట్, అలవెన్సులు అసోసియేషన్ భరిస్తుందన్నారు. క్రీడాకారులు తమ ఒరిజనల్ ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని వివరించారు.

వైఎస్ఆర్ జిల్లా డీఎస్‌డీఓగా జగన్నాథరెడ్డి



కె.జగన్నాథరెడ్డి



ఎస్.గౌస్‌బాషా

కడప స్పోర్ట్స్: వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ)గా కె. జగన్నాథరెడ్డిని నియమిస్తూ శాప్ వీసీ అండ్ ఎండీ ధ్యాన్‌చంద్ర ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవలే శాప్, డీఎస్ఏలను వేర్వేరు శాఖలుగా గుర్తించడంతోపాటు చీఫ్ కోచ్‌గా ఉన్న పదవిని ఉన్న తీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా 2009 బ్యాచ్‌కు చెందిన సీనియర్ కోచ్‌లను డీఎస్‌డీఓలుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేకాధికారిగా పని చేస్తున్న కె.జగన్నాథరెడ్డిని డీఎస్‌డీఓగా నియమించారు. కాగా ఈయన గతంలో అనంతపురం డీఎస్‌డీఓగా పని చేశారు. అదే విధంగా అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓగా వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో వాలీబాల్ శిక్షకుడిగా పని చేస్తున్న ఎస్.గౌస్‌బాషాను నియమించారు. కాగా ఈయన గతంలో జిల్లాలో సుదీర్ఘ కాలం వాలీబాల్ శిక్షకుడిగా సేవలందించారు.

కవి సమ్మేళనానికి ఆహ్వానం

కడప కల్చరల్: కడప జెడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న వైఎస్సార్ జిల్లా రచయిత సంఘం మహాసభల్లో కవి సమ్మేళనంలో పాల్గొనాలని సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి కోరారు. చాలా ఏళ్ల తర్వాత జిల్లాలో రచయితల మహాసభలను నిర్వహిస్తున్నామని, ఇందులో జిల్లా వైభవాన్ని చాటుతూ కవితలు వినిపించేందుకు కవులు ముందుకు రావాలని కోరారు. పాల్గొనదలిచిన వారు ముందు రచయితల సంఘంలో రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. సభ్యత్వం గల కవులు ఈ రెండు రోజుల సభల్లో పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. మన జిల్లా చరిత్ర, సంస్కృతి, వైభవాన్ని చాటి చెబుతూ పద్యాలు లేదా వచన, కవిత రూపంలో 20 లైన్లకు మించకుండా రచన చేయాల్సి ఉంటుందన్నారు. ఈ జిల్లా కవులు, కళాకారులు, స్వాతంత్ర్య సమర యోధులు తదితర అంశాలపై కవిత్వం రాయవచ్చని పేర్కొన్నారు. సభ్యత్వం కోసం సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రమణ్యం (97046 51414) లేదా కోశాధికారి కొప్పోలు రెడ్డిశేఖర్‌రెడ్డి (90325 95101)లను సంప్రదించాలని వివరించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



మోక్షజ్ఞ గౌడ్

చింతకొమ్మదిన్నె: మండల పరిధి అంగడివీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఈడిగ మోక్షజ్ఞగౌడ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు సంబంధించి అండర్–14 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాత తెలిపారు. నంద్యాలలోని ఎస్‌డీఆర్ వరల్డ్ స్కూల్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు జరగనున్న ఈ పోటీలలో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు.

కౌమార విద్యపై అవగాహన సదస్సు

రాయచోటి: రాయచోటిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఒకరోజు కౌమార విద్యపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ ఎద్దుల రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో తమ తమ పాఠశాలల్లో నిర్వహించబోయే ఒకరోజు కౌమార విద్య అవగాహన సదస్సుకు ఎంపిక చేసిన 136 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. 12వ తేదీ అన్నమయ్య జిల్లాలో ఎంపిక చేసిన 55 హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శిక్షణలో పాల్గొనాలని, 13న వైఎస్సార్ జిల్లాలో ఎంపిక చేసిన 81 హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు కడప చిన్నచౌక జయనగర్ కాలనీలోని బాలికల జెడ్పీ హెచ్ హైస్కూల్‌లో నిర్వహించే శిక్షణకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య


బలరామరాజు మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకృతినగర్‌లో నివాసం ఉంటున్న బలరామరాజు (62) అనే రిటైర్డ్ ఉద్యోగి అనారోగ్యంతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన ప్రభుత్వ బాలుర గృహంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందాడు. ఏడాది కాలంగా మొలల వ్యాధితో బాధపడేవాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో తీవ్రమానసిక వేదనకు గురయ్యాడు. దీంతో ఈనెల 9వ తేదీ రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రస్తుతం ఇతనికి భార్య జయప్రదమ్మ, కుమార్తె అనస్తీషియా డాక్టర్ సురేఖ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా ఏఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

వృద్ధురాలి నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

వేంపల్లె : వృద్ధురాలి నేత్రదానం ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిందని నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లె పట్టణం కరణం వీధికి చెందిన బాలం సంజీవమ్మ అనే వృద్ధురాలు మరణించడంతో ఆమె కుమారుడు నాగమల్లయ్య కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి హుటాహుటిన మృతురాలి ఇంటికి చేరుకుని మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కుటుంబంలో వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన సమయంలో నేత్రదానం పట్ల అవగాహన కల్పించి 9966509364, 7093204537 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

లాడ్జిలో అనారోగ్యంతో వ్యక్తి మృతి


సుదర్శన్ శర్మ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని పాత బస్టాండ్ సమీపంలో ఓ లాడ్జిలో ఈనెల 8వ తేదీన విశ్రాంతి తీసుకునేందుకు వచ్చిన డి. సుదర్శన్ శర్మ (42) అనే వ్యక్తి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అనంతపురం జిల్లా గుంతకల్‌లోని తిలక్‌నగర్‌కు చెందిన మృతుడు కడపకు పనిమీద వచ్చాడు. అతని బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగస్వామి తెలిపారు.

కసూర్బా గురుకులం..

అమ్మా నాన్నతో ఓ ఆదివారం..


చాపాడు కస్తూర్బా స్కూల్‌లో తల్లిదండ్రులతో ఆనందంగా గడుపుతున్న విద్యార్థినులు


ఇవిగోమ్మా.. తినుబండారాలు అంటూ ఓ తల్లి తపన


బాగా చదుకోవాలమ్మా.. అంటూ మనుమరాళ్లతో అమ్మమ్మ, తాతయ్యలు


ఇవిగో తల్లీ.. నీకు కావాల్సినవి.. ఇక బాగా చదువకోవడమే నీ పని.. ఓ తండ్రి మనోగతం


తల్లి ఒడిలో ఆనందంగా ఇలా..

ఇక్కడ కనిపిస్తున్న దృశ్యాలు మండల కేంద్రమైన చాపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలోనివి. ప్రతి నెలా రెండో ఆదివారం మాత్రమే అక్కడ చదువుకుంటున్న విద్యార్థినులను తమ తల్లిదండ్రులతో కలిసేందుకు అవకాశం కల్పిస్తారు. మిగిలిన మూడు వారాలు అవసరాన్ని బట్టి విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడవచ్చు. కాని రెండో ఆదివారం మాత్రం తల్లిదండ్రులు, బంధువులతో విద్యార్థినులు కలిసేందుకు 2 గంటలకు పైగా సమయయం కేటాయించారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తల్లిదండ్రులు, బంధువులు ఒక పండుగ వాతావరణంలా తమ పిల్లలతో గడిపారు. ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చిన బిర్యానీ.. చికెన్, మటన్ పులుసు ఇలా తల్లిదండ్రులు తమకు తోచిన విధంగా పిల్లల కోసం తీసుకువచ్చి ఆప్యాయంగా తినిపించారు. నెల రోజులకు సరిపడే విధంగా తినుబండారాలను ఇవ్వటంతో పాటు.. విద్యార్థినులకు తలలు దువ్వటం.. పిల్లలను అక్కున చేర్చుకుని క్షేమ సమాచారాలు తెలుసుకోవడం.. అక్కడి చదువు..ఇతరత్రా వాటిపై మాట్లాడుతూ పిల్లలు, తల్లిదండ్రులు ఆనందంగా గడిపారు.

– చాపాడు

నీటిపై అవగాహన లేకనే రాయలసీమకు నష్టం


'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పాలకుల ద్రోహంతోపాటు నీటిపై అవగాహన లేకనే రాయలసీమ తీవ్రంగా నష్టపోయిందని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి పాణి, ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మహిళా స్వశక్తి భవనంలో రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి రచించిన 'నీటి అవగాహనే రాయలసీమకు రక్ష' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమకు నీళ్లు రాకుండా తెలంగాణ వాదులు అడ్డుకుంటున్నారన్నారు. ముఖ్యంగా కృష్ణా బేసిన్‌లో రాయలసీమ లేదని, పెన్నా బేసిన్ కింద ఉందని వితండవాదనలు చేస్తూ కృష్ణా జలాల్లో రాయలసీమ నీటి హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. నాలుగు రాష్ట్రాల మధ్య జరగాల్సిన కృష్ణా జలాల పునః పంపిణీ కేవలం ఆంధ్ర, తెలంగాణ మధ్య జరగడంలో కేంద్రం కుట్ర ఉందన్నారు. 60 ఏళ్లుగా రాయలసీమకు నీళ్లు లేవని, పాలక పార్టీలన్నీ రాయలసీమను దగా చేస్తున్నాయన్నారు. నాటి రాయలసీమ ఉద్యమం కూడా మిగులు జలాల హక్కుల కోసం మాత్రమే కొట్లాడిందన్నారు. కానీ రాయలసీమ మలిదశ ఉద్యమం మిగులు జలాలు కాదు, రాయలసీమకు నికర జలాలను ఎలా సాధించుకోవచ్చో దారి చూపిందన్నారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో నీటి అవగాహన లేక చాలా నష్టపోయామని తెలిపారు. దశరథరామిరెడ్డి పుస్తకం వెలువరించడం రాయలసీమ సమాజానికి అవసరమన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీఎండీ నజీర్, జనసేన ఇన్‌చార్జి జిలాన్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, రచయిత దాదాహయాత్, విరసం వరలక్ష్మి, జింకా సుబ్రహ్మణ్యం, రాయలసీమ విద్యార్థి శక్తి జిల్లా కన్వీనర్ హరిత, రాయాలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ మహమూద్, చైతన్యమహిళా సంఘం కన్వీనర్ పద్మ, లక్ష్మీదేవి, సృజన సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ తదితరులు పాల్గొన్నారు.

కూతురు ఇంట్లో తండ్రి దొంగతనం

- డబ్బు, సెల్‌ఫోన్‌తో పాటు మూడు నెలల మనవరాలిని ఎత్తుకెళ్లిన వైనం
- 36 గంటల్లో చిన్నారిని తల్లి చెంతకు చేర్చిన త్రీ టౌన్ పోలీసులు


బిడ్డను తల్లికి అప్పగిస్తున్న సీఐ వెంకటరమణ

ప్రొద్దుటూరు క్రైం : అతను తాగుడు కోసం స్వయానా బిడ్డ ఇంట్లోనే దొంగతనానికి పాల్పడ్డాడు. డబ్బు, సెల్‌ఫోన్‌తో పాటు మూడు నెలల పసికందును ఎత్తుకెళ్లాడు. మనిషి తాగుడుకు బానిసైతే ఏ స్థాయికి దిగజారుతాడన్న దానికి ఈ సంఘటన అద్దం పడుతోంది. వివరాలిలా.. గురుప్రియ, నాగునాయక్ దంపతులు ప్రొద్దుటూరులోని సూపర్‌బజార్ రోడ్డులో నాగులకట్ట వీధిలో నివాసం ఉంటున్నారు. గురుప్రియ తండ్రి గురుశేఖర్ అధికంగా అప్పులు చేసి సొంత ఊళ్లో ఉండలేక కొన్ని రోజుల క్రితం కూతురు ఇంటికి వచ్చాడు. పసికందును తండ్రికి అప్పగించి శుక్రవారం గురుప్రియ పని కోసం బయటికి వెళ్లింది. ఆమె ఇంటికి వచ్చే సరికి పాపతో పాటు తండ్రి కూడా కనిపించలేదు. ఇంట్లో డబ్బు, సెల్‌ఫోన్ లేకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె వీధిలోనూ, బంధువుల ఇళ్లలో వెతికింది. అయినా వారి జాడ కనిపించలేదు. దీంతో కంగారు పడిన గురుప్రియ దంపతులు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. త్రీ టౌన్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక సాయంతో రాజంపేటలో ఉన్న గురుశేఖర్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పసికందును తల్లి వద్దకు సురక్షితంగా చేర్చారు. మద్యానికి బానిసై డబ్బు, సెల్‌ఫోన్‌ను గురుశేఖర్ తీసుకెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పసికందును ఇంట్లో ఒంటరిగా వదిలేస్తే ప్రమాదమనే ఉద్దేశంతో అతను మనవరాలిని ఎత్తుకొని వెళ్లాడని పోలీసు అధికారులు తెలిపారు. తమ కుమార్తెను సురక్షితంగా అప్పగించిన త్రీ టౌన్ పోలీసులకు గురుప్రియ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. 36 గంటల్లోనే కేసును ఛేదించిన త్రీ టౌన్ సీఐ వెంకటరమణ, సిబ్బంది శ్రీనివాసులు, తిరుమల, దస్తగిరి, పక్కీరప్ప, శివానంద, హోంగార్డు సురేంద్ర యాదవ్‌లను ఎస్పీ సిద్ధార్థ కౌశల్ అభినందించారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఆదివారం నిర్వహించిన కులాయప్ప మెమోరియల్ జిల్లాస్థాయి ఓపన్ ప్రైజ్‌మనీ చెస్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ పోటీలను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 58 మంది క్రీడాకారులు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. టోర్నమెంట్‌లో విజేతగా వినీల్‌సాయిరెడ్డి నిలవగా, రెండో స్థానంలో ప్రభుదేవా, మూడో స్థానంలో శ్రీకాంత్, 4వ స్థానంలో నజీర్‌బాషా, 5వస్థానంలో పృథ్వీరాజ్ నిలిచారు. వీరితో పాటు మహీధర్, జశ్వంత్, దేవేంద్రనాథ్‌రెడ్డి, జతిన్‌కుమార్‌లు తర్వాతి స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ స్పాన్సర్ రెడ్డిపవన్, చీఫ్ ఆర్బిటర్ ముజంమిల్ పాల్గొన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్


కల సాకారమైంది



కొన్నేళ్లుగా ఉన్న ఇల్లు నిర్మించుకోవాలనే కల ఇప్పుడు సాకారమైంది. గతంలో మట్టి మిద్దెలో నివసిస్తూ ఉండేవాళ్లం. అప్పట్లో ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా గ్రామ వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి మాతో దరఖాస్తు చేయించాడు. అనంతరం ఇల్లు మంజూరైందని చెప్పడంతో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించాం. ప్రస్తుతం ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో గృహ ప్రవేశం కూడా చేశాం. జగనన్న ప్రభుత్వంలోనే ఇంటి నిర్మాణం పూర్తి కావడం సంతోషంగా ఉంది.

– రాజుపాళెం సుహాసిని, వెలవలి గ్రామం, రాజుపాళెం మండలం

జగనన్న సురక్ష ద్వారా కౌలుకార్డు పొందాను



మా గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కౌలు కార్డు వచ్చింది. గతంలో చాపాడు మండలంలోని ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరిగినా వచ్చేదికాదు. జగనన్న సురక్ష ద్వారా మా వలంటీరు ఇంటికి వద్దకు అడిగి కౌలు కార్డును ఎలాంటి ఖర్చు లేకుండా ఇప్పించారు. ఈ ప్రభుత్వం హయాంలోనే కౌలు కార్డు ఇంత సులువుగా రావటం చాలా సంతోషంగా ఉంది.

– వద్ల నాయబ్ రసూల్, కౌలు రైతు, ఖాదర్‌పల్లె, చాపాడు మండలం

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బోధన చేస్తున్నారు. ఇందుకు గతేడాది 10వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మంచి మార్కులే నిదర్శనం. నాడు –నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అత్యాధునిక వసతులతో ఆధునీకరించారు. ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధనతో పాటు ఉపాధ్యాయులు విద్యాభివృద్ధిపై శ్రద్ధ చూపుతున్నారు. **– ఓబులేసు, విద్యార్థి తండ్రి, ఎస్‌పీసీఎస్ మున్సిపల్‌హైస్కూల్, ప్రొద్దుటూరు**

ఔత్సాహిక కళాకారులకు అవకాశం

పులివెందుల టౌన్ : కళాకారులు తమ కళను నిరూపించుకునేందుకు ఒక్క ఛాన్స్ కామెడీ షో ద్వారా అవకాశం వచ్చిందని మా ఊరి సినిమా హీరో మహేష్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శిల్పారామంలో ఏపీ జీరోఫోర్ రామాపురం సినిమా డైరెక్టర్ హేమారెడ్డి ఆధ్వర్యంలో ఒక్క ఛాన్స్ కామెడీ షో ఆడిషన్స్ కార్యక్రమం నిర్వహించారు. పలు జిల్లాల నుంచి 300మందికిపైగా కళాకారులు హాజరయ్యారు. హీరో మహేష్ మాట్లాడుతూ ఒక్క రూపాయి డబ్బు ఖర్చు కాకుండా ఎలాంటి రికమండేషన్లు లేకుండా ప్రతిభ ఉన్న కళాకారులను బయటకు తీసుకురావాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడిగా గునిశెట్టి శ్రీనివాసులు


ఆర్‌జేయూపీ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్తు (ఆర్జేయూపీ) నిరంతరం పోరాటం చేస్తుందని ఆర్జేయూపీ సీనియర్ నాయకుడు, అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం అన్నారు. ఆదివారం కడపలోని పసుపులేటి భుజంగరావు ఆర్జేయూపీ టీచర్స్‌హోంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.


రాష్ట్ర కార్యవర్గం..

ఆర్జేయూపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా గునిశెట్టి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా షరీఫ్, గౌరవాధ్యక్షుడిగా గోపాల్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా రవీంద్రనాథ్, సహాధ్యక్షుడిగా ఓబుల్‌రెడ్డి, కోశాధికారిగా గుదిబండ శ్రీనివాసులు, ముఖ్య సలహాదారులుగా ముత్తోజి వీరబ్రహ్మం, బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా ధర్మరాజు, జగన్మోహనాచారి, శేషఫణి, రెడ్డెన్న, మహిళా కార్యదర్శులుగా అనసూయదేవి, జానకి, స్వయంప్రభ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లింగంపల్లి రవీంద్రనాథ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

జిల్లా నూతన కార్యవర్గం ఇలా..

వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పుల్లయ్య, సహాధ్యక్షుడిగా దాడి ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా సోమలూరు బాబు, కామేశ్వరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ దివంగత రామస్వామి, భుజంగరావుల అడుగుజాడల్లో, సంఘం ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

బ్రహ్మంగారిమఠం : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయాల్సిన 12వ పీఆర్సీలో భాగంగా 45 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ తెలిపారు. బి.మఠంలో ఎస్టీయూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల రెండవ రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. 11వ పీఆర్సీ కాలపరిమితి ముగిసి ఆరు నెలలు అవుతున్నా విధివిధానాలు లేని 12వ పీఆర్సీని ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డీఏలు మంజూరు చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, మల్లు రఘునాథరెడ్డి, దాదాపీర్, సురేష్‌బాబు, సంగమేశ్వరరెడ్డి, ఏడు కొండలు, వెంకటసుబ్బయ్య, రవికేశవరావు, చంద్రహాసరెడ్డి, శేఖర్‌బాబు, సుబ్రమణ్యం, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీ పంచాయతీరాజ్ 4వ తరగతి ఉద్యోగుల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక
- జిల్లా అధ్యక్షుడిగా రాజేష్ ప్రభుకుమార్, కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నిక


ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీ పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్, గౌరవాధ్యక్షులు గోవిందరాజు, లక్ష్మయ్య అన్నారు. ఆదివారం కడపలోని జిల్లా పరిషత్తు కార్యాలయ ఆవరణంలోని డీపీఆర్‌సీ భవన్‌లో ఏపీ పంచాయతీరాజ్ జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జెడ్పీ అధికారులకు వినతిపత్రం ఇవ్వాలని తీర్మానించారు.

ఏపీ పంచాయతీరాజ్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేష్‌ప్రభుకుమార్, గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రతాప్, జాయింట్ సెక్రటరీ–1గా రజిత, జాయింట్ సెక్రటరీ–2గా లక్ష్మిదేవి, ఉపాధ్యక్షులు–1గా విజయకుమారి, ఉపాధ్యక్షులు–2గా జునైద్, ఉపాధ్యక్షులు–3గా శ్రీధర్‌కుమార్, కోశాధికారిగా అమీర్‌బాషా, కో ఆప్షన్ మెంబర్‌గా భవాని, ఆర్గనైజింగ్ సెక్రటరీ–1గా ఆరీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ–2గా వీరమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ–3గా సాయి ప్రకాష్, ఆఫీస్ సెక్రటరీగా శ్రీకాంత్, ఈసీ మెంబర్‌గా మహబూబ్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు ఉద్యోగుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 25 కుటుంబాలు చేరిక


గోవిందరెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలు

పోరుమామిళ్ల : పట్టణంలోని కొలిమివీధి, పొట్టిగారివీధి, ఉద్దికట్టవీధికి చెందిన 25 కుటుంబాల టీడీపీ వారు ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బట్టు కాశయ్య, కండక్టర్ కాశయ్యల ఆధ్వర్యంలో సంగీత శీను, రంగాచారి, మధు, ఓంప్రసాద్, మురళి, శ్రీహరి, శంకరాచారి, లక్ష్మీనారాయణాచారి, సుధాకర్, సుభాషిణి, విజయమ్మ, షంషీర్, ఖాదర్‌బాషా, అన్వర్, బాలబ్రహ్మాచారి, మల్లికార్జునాచారి తదితర 25 కుటుంబాలకు చెందిన వారికి పార్టీ కండువాలు కప్పి వారిని గోవిందరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పోరుమామిళ్ల మండలానికి రూ. 384 కోట్లు నిధులు రాగా అందులో పట్టణానికే 4 సచివాలయాల నిర్మాణానికి రూ. 100 కోట్లు కేటాయించారన్నారు. పట్టణ అభివృద్ధికి మరో వంద కోట్లకు పైగా రాగా ఉద్దికట్టవీధిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వీధిరోడ్డు, శివాలయం వీధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం ఖర్చు చేశామన్నారు. ప్రధాన రహదారిలో డివైడర్ రోడ్డు కోసం రూ. 23 కోట్లు నిధులు కేటాయించారన్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న వైఎస్ జగన్‌ను అందరూ ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరెంట్ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ సీఎం బాషా, మండల కోఆప్షన్ మెంబర్ అల్లా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు, పట్టణ కన్వీనర్ హబీబ్, యువజన కన్వీనర్ చాపాటి సాయి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.